తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | గురువారం | 03 - 09 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 1




# తుర్కకాశ ముస్లింలకు జనరేటర్ల స్కీం

# లబ్ధిదారుల ఎంపికకు రాజకీయ రంగు

## మోత్కూరు మున్సిపాలిటీకి 20 మినీ జనరేటర్లు మంజూరు

## మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మరో లిస్ట్ తయారు చేయడంతో వివాదం


## రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులను ఎంపిక చేసిన కాశగూడెం కాలనీ పెద్దలు

## ఒక్కో యూనిట్ రూ.60 వేలు, మొత్తం రూ.12 లక్షలు..19 మందికి అవకాశం

## మున్సిపల్ ఎదుట కాశగూడెం ప్రజల ఆందోళన..కమిషనర్‌కు వినతి

**ప్రజావారధి/మోత్కూరు**

రాష్ట్ర ప్రభుత్వం తుర్కకాశ ముస్లింలకు ప్రవేశపెట్టిన మినీ జనరేటర్ల స్కీం లబ్ధిదారుల ఎంపిక రాజకీయ రంగు పులుముకుంది. పార్టీల ప్రమేయం, వివాదాలకు తావు లేకుండా ఎంపిక చేసిన లబ్ధిదారుల లిస్టులో పొలిటికల్ లీడర్లు వేలు పెట్టడంతో వివాదం తలెత్తింది. తుర్కకాశ ముస్లింలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ జనరేటర్లు అండ్ టూల్ కిట్ స్కీంలో భాగంగా మోత్కూరు మండలానికి 20 యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్ (జనరేటర్) విలువ రూ.60 వేలు. మొత్తం యూనిట్ల విలువ రూ.12 లక్షలు కాగా అందులో ఒక యూనిట్ మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఉన్న లబ్ధిదారునికి మంజూరు చేశారు. మిగతా 19 యూనిట్లకు గాను ఆ సామాజిక వర్గం ఉన్న మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కాశవారిగూడెంలో 36 మంది దరఖాస్తు చేసుకున్నారు. తుర్కకాశ ముస్లిం సంఘం తరపున రాజకీయ పార్టీలు, వివాదాలకు తావు లేకుండా కుల పెద్దలు కూర్చుని నిర్ణయించి ఏకాభిప్రాయంతో అర్హులైన 19 మందిని ఎంపిక చేసి లిస్టును మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. అధికారులు కూడా ఆ జాబితానే ఫైనల్ చేసే దశలో కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకన్న సామెతలా కొందరు పొలిటికల్ లీడర్లు 'పోసిత్తు' వేయడంతో వివాదం తలెత్తింది. ఇప్పటికే రాష్ట్రంలో ఈ స్కీంలో



లబ్ధిదారులకు జనరేటర్లు, టూల్ కిట్లు పంపిణీ చేస్తుండగా, మోత్కూరులో నాయకులు పెట్టిన చిచ్చుతో అధికారులు అర్హుల జాబితాను ఫైనల్ చేయడం లేదు.

### మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మరో లిస్ట్ తయారు చేయడంతో వివాదం

కాశవారిగూడెం ప్రజలంతా ఏకాభిప్రాయంతో ఎంపిక చేసుకున్న జాబితాను కాదని మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు అదే కాలనీ ప్రజలతో మరో జాబితాను తయారు చేశారు. అందులో ఒకే ఇంట్లో ముగ్గురిని కూడా ఎంపిక చేసినట్టు చెబుతున్నారు. తమ సంఘానికి, కులానికి కట్టుబడి ఏకాభిప్రాయంతో ఎంపిక చేసిన జాబితాను పక్కన పెట్టి కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ చైర్మన్ మరో జాబితా తయారు చేసి తమ మధ్యను చిచ్చు పెట్టాలని చూస్తున్నారని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. తమకు లేని అభ్యంతరం వారికెందుకని ప్రశ్నిస్తున్నారు. కాశవారిగూడెం మున్సిపాలిటీలో 10వ వార్డు పరిధిలో ఉండగా ఆ వార్డులో బీఆర్ఎస్ కౌన్సిలర్ నల్ల మధు గెలుపొందారు. తమకు పార్టీలతో ఏం సంబంధమని, మీరంతా కాంగ్రెస్‌కు ఓటు వేయలేదంటున్నారని, ఓటు వేసింది లేనిది మీరెలా చెబుతారంటున్నారు. బండలు కొట్టుకుని బతికే తమకు ప్రభుత్వం  బండలు కొట్టడానికి జనరేటర్లు, టూల్ కిట్లు ఉపయోగపడతాయని ఈ స్కీం అమలు చేస్తుందని, రాష్ట్రం, జిల్లా మొత్తం తమ సంఘం ద్వారానే అర్హులైన వారిని ఎంపిక చేస్తున్నారని, ఇక్కడ కూడా తాము అలానే ఎంపిక చేసుకోగా కొందరు నాయకులు తమ స్వార్థం కోసం వివాదం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### మున్సిపల్ ఎదుట కాశగూడెం ప్రజల ఆందోళన..కమిషనర్‌కు వినతి

మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మరో జాబితాతో వివాదం చేయడాన్ని నిరసిస్తూ కాశవారిగూడెం ప్రజలు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కాలనీ ప్రజల మధ్య విభేదాలు సృష్టించడానికే మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీకి ఐదు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా బీఆర్ఎస్‌కు ఓట్లు వేశామని వాటిని కూడా రద్దు చేశారని ఆరోపిస్తున్నారు. రాజకీయ వివాదం చేయకుండా తమ సంఘం, కుల పెద్దల ద్వారా ఎంపిక చేసిన జాబితాను ఫైనల్ చేయాలని, తమకు రాజకీయాలు అంటగట్టవద్దని, తమకు మంజూరైన జనరేటర్లు రాకుండా అడ్డుకోవద్దని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

### రెండు, మూడు రోజుల్లో ఫైనల్ చేస్తాం

**-జి.నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు**

తుర్కకాశ ముస్లింలకు జనరేటర్లు అండ్ టూల్ కిట్స్ పంపిణీలో భాగంగా మోత్కూరు మున్సిపాలిటీకి 19 యూనిట్లు మంజూరయ్యాయి. పూర్తి సబ్సిడీతో ఒక్కో యూనిట్ విలువ రూ.60 వేలు. ఆ సామాజికవర్గం ప్రజలంతా కాశవారిగూడెంలోనే ఉన్నారు. 39 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో అర్హుల జాబితాను ఫైనల్ చేసి కలెక్టర్‌కు పంపుతాం.

### రాజకీయ వివాదం చేయొద్దు

**-నల్ల మధు, 10వ వార్డు కౌన్సిలర్, ధర్మాపురం**

తుర్కకాశ ముస్లిం ప్రజలంతా 10వ వార్డు పరిధిలోని కాశవారిగూడెంలోనే ఉన్నారు. ఆ స్కీం గురించి తనకు తెలిసినా కాలనీవాసులు, కుల పెద్దలు కూర్చుని మాట్లాడుకుని 19 మందిని ఎంపిక చేశారు. ఒకరిద్దరు కాంగ్రెస్ నాయకులు వారి మధ్య విభేదాలు పెట్టేలా వారు ఇచ్చిన జాబితాను కాదని మరో జాబితాను తయారు చేశారు. బండలు కొట్టుకుని బతికే ప్రజలతో రాజకీయం చేసి వివాదం చేయొద్దు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో స్కీంలను పార్టీలకతీతంగా ప్రజలకు అందించాం. మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు తమ స్వార్థం కోసం వారికి నష్టం చేయడం సరికాదు.